
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 20-08-2025
Medchal - Malkajgiri | Wednesday 20-08-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 87 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 87 | Pages : 8 | ₹: 5

ఈ ఫొటోల్లో అమ్మడు గ్లామర్ డోస్ కాస్త పెంచేసింది. అయితే కొంతమంది ఈ ముద్దుగుమ్మ పై నెగిటివ్ కామెంట్స్ చేశారు. తన పై నెగిటివ్ కామెంట్స్ చేసిన వారికి అన్ను స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఇద్దరు పిల్లల తల్లివి.. కాస్త పద్ధతిగా ఉండొచ్చుగా.. 20ఏళ్ల అమ్మాయివి అనుకుంటున్నావా.? సర్జరీ చేసుకోకముందే బాగుండేదానివి, ఇప్పుడు సన్నగా అయ్యావు. ఎందుకంటే ఈ కామెంట్స్ చూస్తేనే మీరు ఎలాంటివారో అర్థమవుతుంది. ఇక నేను ఎలాంటి సర్జరీ చేయించుకోలేదు. కనీసం లిప్స్ పీలర్ కూడా చేయించుకోలేదు. కానీ నాకే ఇబ్బందిగా అనిపించి స్లిమ్‌గా అయ్యా.. నేను ఇప్పుడు బాగానే ఉన్నా.. . మీకు సంతోషాన్ని కలిగించే పని మాత్రమే చేయండి.. అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది అన్ను .





## 50 మంది వ్యోమగాముల్ని తయారు చేయాలి

- శుభాంశు శుక్లాతో ప్రధాని మోదీ

✍ జయభేరి, న్యూఢిల్లీ, ఆగష్టు 19 :

అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి వచ్చిన ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లాతో ప్రధాని మోదీ మాట్లాడారు. ఢిల్లీలో ఆ ఇద్దరూ పలు అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకున్నారు. యాక్సియం4 స్పేస్ మిషన్‌కు గ్రూప్ కెప్టెన్ శుక్లా .. పైలెట్‌గా చేశారు. సోమవారం ఆ ఇద్దరూ కాసేపు ముచ్చటించారు. ఆ భేటీకి సంబంధించిన వీడియోను రిలీజ్ చేశారు. అంతరిక్షంలో వాతావరణం భిన్నంగా ఉంటుందని, అక్కడ గురుత్వాకర్షణ ఉండదని శుక్లా అన్నారు. స్పేస్ స్టేషన్‌లో ఫుడ్ చాలా పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. అక్కడ చాలా తక్కువ స్థలం ఉంటుందని,

...మిగతాది 2 లో



## విపక్ష పార్టీల ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి

✍ జయభేరి, న్యూఢిల్లీ, ఆగష్టు 19 :

తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిని విపక్ష పార్టీలు ప్రకటించాయి. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేశాయి. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకులమైలారం. 1971లో ఉస్మానియా వర్సిటీలో బి.సుదర్శన్ రెడ్డి లా చదివారు. 2007, 11 మధ్య ఆయన సుప్రీం కోర్టు జడ్జిగా పని చేశారు. గోవా తొలి లోకాయుక్తగా ఆయన సేవలందించారు. 2005లో గువాహటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేశారు. ఇప్పటికే ఎన్డిఎ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి. రాధాకృష్ణన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రాధాకృష్ణన్, సుదర్శన్ రెడ్డిల మధ్య ఉప రాష్ట్రపతి పదవి కోసం సెప్టెంబర్ 9న పోటీ జరగనుంది.



## రూ.1,000 కోట్లు అద్దె..!

✍ జయభేరి, బెంగళూరు, ఆగష్టు 19 :

భారత్‌లో ఐఫోన్ల తయారీని భారీగా పెంచడంపై దృష్టి సారించిన దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ సంస్థ.. తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోంది. దేశీయంగా ఐఫోన్ ఉత్పత్తిని పెంచనున్నట్లు ఇప్పటికే యాపిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా బెంగళూరులో ఎంబసీ జెనిత్ భవనంలో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుంది. డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎంబసీ గ్రూప్ కు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్ లోని ఆ కార్యాలయ స్థలం కోసం 10 ఏళ్ల కాలానికి యాపిల్ సంస్థ డీల్ కుదుర్చుకుంది. 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం యాపిల్ సంస్థ నెలకు రూ.6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఏడాదికి 4.5 శాతం చొప్పున అద్దె పెంపుతో పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపిమొత్తం ఈ పదేళ్లలో సంస్థ రూ.1,000 కోట్లను అద్దెగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. 2025 ఏప్రిల్ 3 నుంచి ఈ లీజు అమల్లోకి వచ్చింది.

- ఉపరాష్ట్రపతి ఓటింగ్ విషయంలో అధిష్టానం చెప్తే కేసీఆర్ ని కలుస్తా
- అధిష్టానం ఆదేశిస్తే కేసీఆర్ ను కలవడానికి నేను సిద్ధం
- ఆయన అపాయింట్మెంట్ ఇస్తాడో లేదో
- అసలు అయన నా కళ్లలోకి చూస్తాడో లేదో
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్డీఏ.. సీఎం రేవంత్ ఫైర్



# కలవడానికి నేను సిద్ధం



బీసీ రిజర్వేషన్ బిల్లుపై సుప్రీంకోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. మంగళవారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్ చాట్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 90రోజుల్లో రాష్ట్రపతి బీసీ రిజర్వేషన్ బిల్లు పూర్తిచేయాలని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఇంకా ఆలస్యమైతే పార్టీ పరంగా ఇద్దామని అందరినీ కోరి ఎన్నికలకు వెళ్లడమే తమ ముందున్న ప్రత్యామ్నాయమని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి.

...మిగతాది 2 లో

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్డీఏ..

✍ జయభేరి, హైదరాబాద్, ఆగస్టు19 :

ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలుగు ప్రజల ప్రతిష్టను పెంచే విధంగా తీసుకున్న నిర్ణయమని ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను ఎన్డీఏ కూటమి అపహాస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీఏ దుర్వినియోగం చేస్తోందని ఫైర్ అయ్యారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న కూటమి ఒకవైపు, రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న ఎన్డీఏ కూటమి మరోవైపు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తున్న వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని ఉద్ఘాటించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పార్టీలు మద్దతుగా నిలవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలుపునకు చంద్రబాబు, కేసీఆర్, పవన్ కల్యాణ్, జగన్ కృషిచేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని సూచించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ సభ్యుడు, ప్రతినిధి కాదని స్పష్టం చేశారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఏ పార్టీతో సంబంధం, అనుబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాజ్యాంగ పరిరక్షకుడిగా వ్యవహరిస్తారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఓబీసీ రిజర్వేషన్ల కోసం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పుకొచ్చారు. బీసీ బిల్లు ఆమోదం పొందాలంటే న్యాయకోవిదుడు కీలక పదవిలో ఉండాలని సూచించారు. రాధాకృష్ణన్ గెలిస్తే.. బీసీలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని తెలిపారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని నొక్కిచెప్పారు. ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. ఇది తెలంగాణ వర్సెస్ తమిళనాడు కాదని వెల్లడించారు. రాజ్యాంగాన్ని రక్షించేవారికి, రాజ్యాంగాన్ని గౌరవించనివారికి జరిగే పోరాటమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# అసత్య ప్రచారాలు చేసేవారిపై ప్రత్యేక చట్టం

- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం
- వాస్తవాలను తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఒక ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేస్తాం
- అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తూ ప్రజలను అభత్రావాభానికి గురి చేస్తున్నారు
- ఎపి బ్రాండ్ ను దెబ్బతీసే రీతిలో సోషల్ మీడియాలో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు
- సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తే తట్టుకోలేక లేనిపోని ఆరోపణలు
- శ్రీకాంత్ పెరోల్ రద్దు చేసి తిరిగి జైలులో పెట్టాం దానిపై విచారణ జరుగుతోంది
- రాష్ట్ర హోంశాఖామంత్రి అనిత



✍ జయభేరి, అమరావతి, ఆగష్టు 19:

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నట్టు రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖామంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన

...మిగతాది 2 లో

## దుద్దెనపల్లి మామిడి చెరువు నీళ్ల లీకేజీని బంద్ చేయండి

2

# కొత్త కొలువుల్లేవ్.. పాత పనులుండవ్

- భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల ప్రభావం.. రిస్క్‌లో 3 లక్షల ఉద్యోగాలు
- టారిఫ్‌లు కొనసాగితే వస్త్ర, రత్నాలు-ఆభరణాల రంగాలకు కష్టాలు
- ఆటో విడిభాగాల తయారీ, ఎంఎస్ఎంఈలకూ ఇబ్బందులే
- ఇరు దేశాల మధ్య వాణిజ్య ఆందోళనలపై నిపుణులు




✍ జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 19 :

అమెరికాలోకి వచ్చే భారతీయ వస్తూత్పత్తులపై ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు.. లక్షల్లో ఉద్యోగాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. టారిఫ్‌లు ఇలాగే కొనసాగితే దేశీయ ఎగుమతులపై తీవ్ర ప్రభావం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారిప్పుడు. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పైనే ప్రధానంగా ఆధారపడిన భారత వస్త్ర, రత్నాలుఆభరణాల రంగాల్లో 3 లక్షలదాకా ఉద్యోగాలు రిస్క్‌లో పడవచ్చని అంచనా వేస్తుండటం గమనార్హం.

...మిగతాది 2 లో

## ఒక్క ఫోటో వెయ్యి భావాలను తెలియచేస్తుంది

- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



✍ జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 19 :

ఒక్క ఫోటో వెయ్యి భావాలను తెలియచేస్తుందని, రాష్ట్రంలో ఫోటోజర్నలిస్టుల సంక్షేమానికి వారిలో ప్రొఫెషనలిజం పెంపొందించేందుకు చర్యలు చేపడుతామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలలో విజేతలకు నేడు బహుమతి, నగదు పురస్కారం అందించే కార్యక్రమానికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంజాగుట్టలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన

...మిగతాది 2 లో

## విరామం ఎరుగని మంత్రి సీతక్క ఎక్కడ ఉన్నా ములుగు ఆలోచనే

- ములుగు జిల్లాలో వరద పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి సీతక్క



✍ జయభేరి, ములుగు :

ములుగు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల ప్రభావం నేపథ్యంలో పరిస్థితిని సమీక్షిస్తూ మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చెరువులు, కుంటల నీటి మట్టం, వాగులు, వంకల పరిస్థితులపై అధికారులు మంత్రికి నివేదిక

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కలవడానికి నేను సిద్ధం

ఈ నెల 23వ తేదీన జరిగే పీఏసీలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతికి మద్దతు కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలుస్తారా అని మీడియా ప్రతినిధులు రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అధిష్టానం ఏం ఆదేశిస్తే అదే చేస్తానని తెలిపారు. కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇస్తారో లేదో.. ఆయనకు తన మొఖం చూడటం ఇష్టం ఉందో లేదోనని సరదాగా వ్యాఖ్యానించారు సీఎం రేవంత్‌రెడ్డి. కేసీఆర్ ఆస్పత్రిలో ఉంటే తానే వెళ్లి పరామర్శించానని గుర్తుచేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఎంపిక చేసిందని చెప్పుకొచ్చారు. తన నిర్ణయం ఏం లేదని.. ఇండియా కూటమి నిర్ణయమని స్పష్టం చేశారు. తాను రెగ్యులర్‌గా ఆయనను కలుస్తానని తెలిపారు. తాను జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్‌కు వెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## కొత్త కొలువుల్లేవ్.. పాత పనులుండవ్

దేశంలో పెద్ద ఎత్తున ఉండే డిమాండ్, అమెరికాయేతర దేశాలకు భారీగా జరుగుతున్న ఎగుమతుల వల్ల సుంకాల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని కొందరు చెప్తున్నా.. మెజారిటీ విశ్లేషకులు మాత్రం కీలక రంగాలు కుదేలేనన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వాహన విడిభాగాల తయారీ సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లు ఒడిదొడుకులకు గురి కావచ్చంటున్నారు. ఔషధ రంగం వంటి ఒకట్రెండు ఇండస్ట్రీలపై టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చంటూనే.. చివరకు ఐటీ సేవలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కూడా ప్రభావితం కావచ్చని చెప్తుండటం ఆందోళనల్ని రేకెత్తిస్తున్నది.

భారతీయ వస్త్ర, రత్నాలుఆభరణాల ఎగుమతుల్లో మెజారిటీ వాటా అమెరికాదే. అందుకే ఆ దేశం టారిఫ్‌లు ఇప్పుడు ఈ రంగాల్లో ప్రకంపనల్ని పుట్టిస్తున్నాయి. పెరిగే సుంకాల భారం.. అమెరికాలో భారతీయ వస్త్ర, రత్నాలుఆభరణాల వస్తూత్పత్తుల ధరల్ని పెంచగలవు. ఇదే జరిగితే మార్కెట్‌లో అమ్మకాలు పడిపోతాయి. ప్రత్యామ్నాయంగా అమెరికన్లు ఇతర దేశాల నుంచి వస్తున్న వస్త్ర, రత్నాలుఆభరణాల వైపు చూసే వీలున్నది. దీంతో క్షీణించే ఎగుమతులు.. ఉత్పత్తి తగ్గుదలకు దారితీస్తే అంతిమంగా వ్యయ నియంత్రణ, ఉద్యోగుల తొలగింపులు, నష్టాల్లో ఉన్న సంస్థల మూసివేతలే ఉంటాయని ఆయా రంగాల నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే సుంకాలు ఇలాగే కొనసాగితే దేశీయ వస్త్ర, రత్నాలుఆభరణాల రంగాల్లో 2 నుంచి 3 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డట్టేనని అంచనా వేస్తున్నారు. ఇక ఉన్న ఉద్యోగాలనే తీసేసే కంపెనీలు.. కొత్తగా నియామకాలకు ఎందుకు వెళ్తాయని కూడా ప్రశ్నిస్తున్నారు. దీంతో ఉద్యోగావకాశాలూ సన్నగిల్లుతాయని పలువురు పేర్కొంటున్నారు. తాత్కాలిక, కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో లాజిస్టిక్ వర్కర్లు, షాప్‌ఫ్లోర్ వర్కర్లు, సేల్స్ సిబ్బందికి ఇబ్బందులేనన్న అంచనాలున్నాయి. టెక్స్‌టైల్స్, ఆటో కంపోనెంట్స్, వ్యవసాయ, రత్నాలుఆభరణాల రంగాలు అమెరికా సుంకాలతో తీవ్రంగా ప్రభావితమయ్యే వీలున్నది. సూరత్, ముంబై సీప్జ్ వంటి రత్నాల హబ్‌ల్లోనూ పెద్ద ఎత్తున ఉద్యోగులు రిస్క్‌ను ఎదుర్కొంటారు. ఎలక్ట్రానిక్స్, రత్నాలుఆభరణాలు, టెక్స్‌టైల్స్, వాహన విడిభాగాలు, తోలు, పాదరక్షలు, రొయ్యలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు అమెరికా టారిఫ్‌లతో ప్రభావితం అవుతాయి. ఇప్పటికే ఆయా రంగాల్లోని కంపెనీలు వ్యయ నియంత్రణ చేయడం, కొత్త నియామకాల ప్రక్రియను ఆపేస్తున్నాయి.

## ఒక్క ఫోటో వెయ్యి భావాలను..

కార్యదర్శి రామకృష్ణా రావు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సమాచారశాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక, సిఎం కార్యాలయం సీపీఆర్ఓ మల్సూర్‌లు అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, కాలాన్ని బంధించి మధుర స్మృతులను అందించే శక్తి ఒక్క ఫోటోగ్రఫర్లకే ఉంటుందని, వారిని ప్రోత్సహించే దిశగా ప్రతీ సంవత్సరం వరల్డ్ ఫోటోగ్రఫీడేను అధికారికంగా నిర్వహించి, ఫోటో కాంపిటిషన్లలో విజేతలను నగదు బహుమతులు, మెమెంటోలను ప్రదానం చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేది ఫోటో జర్నలిస్టులని అన్నారు. స్వాతంత్రోద్యమం నుండి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రచార మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటిలో ఫోటోగ్రఫీకి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక మాట్లాడుతూ, కాలం గడచినా, ఫోటోలు మాత్రం చెక్కుచెదరకుండా గత మధుర స్మృతులను మిగులుస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాలన్నీ సమాచార శాఖ ఆధ్వర్యంలో గత 28 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి 5 విభాగాలకు నిర్వహించిన ఫోటో కాంపిటీషన్‌కు 94 మంది పాల్గొని 744 ఫోటోలను పంపించారని చెప్పారు. ఫోటోగ్రఫీ రంగంలో నిష్ణాతులైన వారిచే ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ విజేతలను ఎంపిక చేసిందని వివరించారు. ప్రధానంగా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రాజీవ్ యువ వికాసం, జనరల్ అనే ఐదు విభాగాలుగా ఎంట్రీలను ఆహ్వానించి ప్రతీ విభాగానికి 8 బహుమతులను ప్రకటించామని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ పోటీలలో పాల్గొన్న విజేతలకు నగదు , శాలువాతో పాటు మెమెంటోను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సి.ఎస్. రామకృష్ణా రావు, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీపీఆర్ఓ మల్సూర్‌లు అందచేశారు.

## 50 మంది వ్యోమగాముల్ని తయారు

దాని వల్ల కార్గో చాలా ఖరీదుగా మారుతుందని శుక్లా చెప్పారు. నేను ఎక్కడికి వెళ్లినా, అక్కడ అందరూ సంతోషంగా ఉన్నారని, అంతరిక్ష రంగంలో భారత్ మెరుగైన ప్రదర్శన ఇస్తుందన్న విషయం అందరికీ తెలుసు అని శుక్లా అన్నారు. ఎప్పుడు ఆ మిషన్ జరుగుతుందని ప్రశ్నిస్తున్నారని శుక్లా తెలిపారు. తాము వెళ్లిన మిషన్ సక్సెస్ అయ్యిందని, అంత మాత్రాన మిషన్ పూర్తి అయినట్లు కాదు అని శుక్లా తెలిపారు. శుక్లాతో మాట్లాడిన మోదీ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యోమగాముల బృందాన్ని తయారు చేయాలన్నారు. సుమారు 40 నుంచి 50 మంది వ్యోమగాముల బృందాన్ని సంకల్పిస్తున్నట్లు చెప్పారు. తాను బాల్యంలో ఉన్నప్పుడు రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లారని, అప్పుడు ఆస్ట్రోనాట్ కావాలన్న ఆలోచన తనకు కలగలేదని శుక్లా అన్నారు. కానీ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి వచ్చిన తర్వాత స్కూల్ పిల్లలతో మూడుసార్లు మాట్లాడానని, ప్రతి ప్రోగ్రామ్‌లో ఎలా తాను ఆస్ట్రోనాట్ కావాలని పిల్లలు అడిగినట్లు శుక్లా చెప్పారు. ఇదే మన దేశానికి పెద్ద సక్సెస్‌గా భావించవచ్చు అన్నారు. వీలైనంత మందిని తన స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని శుక్లా తెలిపారు. స్పేస్ స్టేషన్, గగన్‌యాన్.. ఈ రెండూ అతి పెద్ద ప్రాజెక్టులు అని, వీటి ఏర్పాట్లలో నీ అనుభవం ఉపయుక్తంగా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు.

## విరామం ఎరుగని మంత్రి సీతక్క

సమర్పించారు. ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వరద ప్రాంతాల్లో మానవ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. చేవెళ్ల ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, హైదరాబాద్ తిరుగు ప్రయాణం మధ్యలోనే మంత్రివర్యులు ఈ సమీక్ష జరపడం విశేషం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని గుర్తు చేస్తూ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ సిద్ధంగా ఉంచాలని, వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగినంత ఆహారం, తాగునీరు, వైద్య సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ఇప్పుడు ఆ జాబితాలో మంత్రి సీతక్క కూడా నిలిచారు. తన నియోజకవర్గంలోని ప్రతి చెరువు, వాగు, తోగు, కుంటపై సంపూర్ణ అవగాహనతో, వాటి పేర్లను వేళ్లమీద లెక్కపెట్టినట్టుగా పలుకుతూ, వరద పరిస్థితులపై అధికారులు ఇచ్చిన నివేదికలను సమీక్షించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. కొండాయి, భూటారం, జంపన్న వాగు, ప్రాజెక్ట్ నగర్ వాగు, గుండ్ల వాగు, కాల్వపల్లి... ఇలా ప్రతి వాగుపై ప్రత్యేక పట్టు ఉన్న సీతక్క, అక్కడి పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. జంపన్న వాగు సహా ములుగు జిల్లాలోని అన్ని వాగుల పరిస్థితిపై నిశితంగా దృష్టి పెట్టి, ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను తక్షణం సురక్షిత ప్రదేశాలకు తరలించాల్సిందిగా కలెక్టర్‌తోపాటు సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.

# దుద్దెనపల్లి మామిడి చెరువు నీళ్ల లీకేజీని బంద్ చేయండి

**చెరువు అంటే ఊరికి అండ.. నీళ్ల దరువులేని ఊరు ఉండదు.. చెరువు పెద్దదైతే ఊరు కూడా పెద్దగా ఉంటుంది.. అందుకే ఆస్తి, భూమి లేని ప్రజలు కూడా మన ఊరు.. మన చెరువు అని పిలుచుకుంటారు. వానలు కురిస్తేనే చెరువులు నిండి పంటలు పండి అందరికీ ఉపాధి దొరుకుతుంది. నదుల పరిసరాలలో ఆవాసాలుగా ఉన్న మనుషులు వాన నీళ్ల ప్రవాహానికి అడ్డు కట్టలు వేసి నీటిని నిల్వ చేసుకోవడాన్ని ఆవిష్కరించారు.**







✍ జయభేరి, సైదాపూర్ :

సింధులోయ నాగరికతలో సుమారు క్రీస్తు పూర్వం 3300 నుండి 1700లలో నీటి నిల్వ, స్నానాలకై చెరువులను, మెట్ల బావులను నిర్మించారు. మౌర్యుల కాలంలో క్రీస్తు పూర్వం 322 నుండి 185 వరకు నీటి పారుదలకు, సరఫరాకు ఆనకట్టలు, కాలువలను నిర్మించారు. దక్షిణ భారత్ లోని చోళ రాజులు క్రీస్తు శకం 9 నుండి 13వ శతాబ్దంలో కాలువలు, పెద్ద ట్యాంకులు ముఖ్యంగా "కల్లనై ఆనకట్ట" నిర్మాణం చేశారు. కాకతీయ రాజులు గణపతి దేవా, రాణి రుద్రమ దేవి, సైన్యాధిపతి రేచర్ల రుద్రుడు 13వ శతాబ్దంలో రామప్ప, లక్నవరం, పాకాల, భద్రకాళి, ఘనపురం, బయ్యారం చెరువులను నిర్మించారు. నిజాం పాలనలో 1562 లో "హుస్సేన్ సాగర్" 1891లో ఇప్పటి సిద్దిపేట జిల్లా శనిగరం వాగుపై "శనిగరం చెరువు"ను నిర్మించారు. దీని నిర్మాణానికి 560 షేర్ల (504 కిలోల) బంగారం ఖర్చుపెట్టారు. 1908 మూసీ నది వరదలు ఉప్పొంగి ప్రవహించడం మూలంగా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించినవి. వరద నియంత్రణ గురించి ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రణాళికతో 1920లో మూసీ నదిపై "హిమాయత్ సాగర్", ఉస్మాన్ సాగర్ (గండిపేట్) నిర్మాణాలను ప్రారంభించి 1927లో పూర్తిచేశారు. అలాగే శామీర్ పేట దగ్గర మరొక చెరువును, 1923 లో నిజాంసాగర్ డ్యామ్ ను నిర్మించారు. ఈ రోజుల్లో ప్రజలు చెల్లించిన పన్నులతో సిసీ (సిమెంట్ కాంక్రీట్) రోడ్స్ నిర్మాణానికి కూడా ప్రోటోకాల్ పేచీలతో పోటీలుపడి శిలాఫలకంలో పేర్లు రాయించుకుంటున్నారు. కాని నాటి తెలంగాణాలో ప్రతి ఊరికి చెరువు, కుంటలను నిర్మించినప్పటికీ కాలమానం తెలిపే శిలాఫలకాలను, శాసనాలను ప్రదర్శించుకోలేదు. నేటి తెలంగాణలో 12,777 గ్రామ పంచాయతీలు, 10,909 రెవిన్యూ గ్రామాలు, 46,531 చెరువులు ఉన్నవి. ఇంకా గోదావరి బేసిన్ లో ప్రాజెక్టులు, బ్యారేజీలు, రిజర్వాయర్ లు, డ్యామ్ లు 44 ఉన్నవి. ఇందులో కొన్నింటిని ఇంకా నిర్మించవలసి ఉంది. అలాగే కృష్ణానది బేసిన్ లో 33 ఉన్నవి. లిఫ్ట్ ఇరిగేషన్ లు కాళేశ్వరంతో పాటుగా 10 ఉన్నవి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024, 2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10,820 కోట్లతో కొత్త నీటిపారుదల సామర్థ్యాన్ని పెంచడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా, సైదాపూర్, హుస్నాబాద్, చిగురుమామిడి, బెజ్జంకి, కోయడ, బీందేవరపల్లి మండలాలలో తీవ్ర కరువుతో అల్లాడిన ప్రాంతాలు. "మిడ్ మానేరు" నీళ్లు వస్తున్నప్పటి నుండి, 2020 నుండి 2024 వరకు క్రమంగా వర్షాలు కురిసినందున కొత్త వ్యవసాయ బావులు తవ్వడం, బావులలో పూడిక తీయడం తగ్గింది. ఈ 2025 వర్ష కాలంలో ఇంకా చెరువులు, కుంటలు నిండలేదు. కోతుల బెడదకు మొక్క జొన్న, వేరుశనగ లాంటి ధాన్యం పంటలను విత్తడం క్రమంగా తగ్గుతుంది. పత్తి, వరి పంటలను పండించడానికి మొగ్గుచూపుతున్నారు. వరి నారును సిద్ధం చేసుకుని ఇంకా వర్షాల కొరకు, కాలువ నీళ్ల కొరకు ఎదురు చూస్తున్నారు. దుద్దెనపల్లి గ్రామంలోని గొలుసు చెరువులు, కుంటలు ఊరి చుట్టూ ఉన్నవి. అయినగాని రెండు, మూడెకరాలకు ఒక వ్యవసాయ బావి ఉన్నది. ఒకొక బావి లోతు 20 నుండి 28 మీటర్ల లోతు ఉంటాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండినప్పుడే బావుల్లోని నీటి ఊట పైకి వస్తుంది. ఊరికి దక్షిణాన పెద్దగుట్ట, చిన్నగుట్టలు ఉన్నవి. పెద్ద గుట్ట మీద, వ్యవసాయ భూములపై కురిసిన వర్షపు నీళ్లు "తూము కుంట" నుండి "పడాల చెరువు" (పెద్ద చెరువు), "మీది కుంట"(రేణుకుంట), "కింది కుంట" (శీలవాణి కుంట), పొరుగు గ్రామం ఎగ్లాస్ పూర్ లోని "నాగులు చెరువు, "దేవుని చెరువు", కల్వల ప్రాజెక్ట్ నుండి మానేరు నదిలో కలుస్తాయి. అలాగే పెద్దగుట్ట, చిన్నగుట్టలకు అవతలి వైపున ఉన్న "గన్నేరు చెరువు", మామిడి చెరువు", చిన్న గుట్ట ప్రక్కనున్న పూరు కుంట, ఊరికి ఉత్తరాన ఉన్న "ఊర చెరువు" గొలుసు చెరువులుగా నీళ్లను నింపుకుంటాయి. అయితే ఒక్క మామిడి చెరువుకు మాత్రమే నీళ్ల పడుపాటు, వరద వచ్చే అవకాశం ఉంది. ఊరి గుట్టల నీళ్లతో పాటుగా మహ్మదాపూర్ కోటగిరి గుట్టలు, మహా సముద్రం గండి, ఉమ్మాపూర్, బైరంచెరువు, సర్వాయి పాపన్న చెరువు గొలుసు చెరువుల నీళ్లు పీడర్ చానల్ కాలువ ద్వారా ఆకునూరు చెరువుకు పొగ, దుద్దెనపల్లి మామిడి చెరువుకు "పిచ్చకుంట్ల వాగు ద్వారా వర్షపు నీరు ప్రవహిస్తుంది. మామిడి చెరువు మత్తడి నీళ్లను పీడర్ చానల్ కాలువ ద్వారా దుద్దెనపల్లి ఊర చెరువును నింపుకున్న పిదప వాగులోకి దారి మళ్లించిన నీరు సోమారం, బూడిదపల్లె, కేశవపట్నం, మక్తా, ముత్తారం పరిసర గ్రామాల ద్వారా కల్వల ప్రాజెక్ట్ లోకి పోయి అక్కడి నుండి మానేరు నదిలో కలుస్తాయి. ఇప్పుడు చెదురుమదురుగా కురుసున్న వర్షాల వల్ల మామిడి చెరువులోకి వచ్చిన నీరు "తూము లీకేజీ" వలన వృధాగా పోతున్నాయని రైతులు ఆందోళన చెందుచున్నారు. చెరువులో ఉన్న నీటి లీకేజీని అరికట్టి పొదుపుగా వాడుకుంటే భూగర్భ జలాలు పెంపొంది వ్యవసాయ బావులలో నీటి ఊట పెరుగుతుందని, చెరువు వెనుక వరి పొలాలు పండుతాయని ఆశిస్తున్నారు. గతంలో వంద ఊర్లకు ఒక తహసీల్దార్, బ్లాక్ కు బీడీఓ (బ్లాక్ డెవలప్ మెంట్ ఆఫీసర్) ఉన్నప్పుడైన కనీసం ప్రతి ఊరిలోని చెరువులకు నీరటి/చెరువు రక్షకుడిగా చెరువు తూములను సరిచేసి నీళ్లు లీకేజీ గాకుండా పనులు చేసేడివారు. కాని ఇప్పుడు మండల వ్యవస్థ వచ్చి పది, పద్నాలుగు ఊర్లకు ఒక ఎమ్మార్వో, ఎంపిడిఓ, ఎండిఓ, పంచాయితీ రాజ్ ఇంజనీర్ లు విధులను నిర్వహిస్తున్నప్పటికీ చెరువుల రక్షణను పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదనకు గురైతున్నారు.

> **నీటి లభ్యత గుర్తించి వాగులపై, ఒర్రెలపై పేర్కొలేషన్ ట్యాంకులు, చెక్ డ్యామ్ లను నాణ్యతగా నిర్మించాలి. ప్రస్తుత అత్యవసర పనుల నిర్వహణగా దుద్దెనపల్లి మామిడి చెరువు తూము నీళ్ల లీకేజీని బంద్ పెట్టించి, గ్రామాల వారీగా ఉన్న చెరువుల తూములను కూడా పర్యవేక్షింప చేయాలని ప్రజలు కోరుతున్నారు.**

తెలంగాణలో 2014లో వ్యవసాయ బోర్ వెల్/బావుల సంఖ్య దాదాపు 19 లక్షల నుండి 2022 నాటికి 26.97 లక్షలకు పెరిగాయి. కేంద్ర భూగర్భ జల బోర్డ్ (సీజీడబ్ల్యూబి) నివేదిక ప్రకారం 2019, 2020లో 235 టీఎంసీ (శతకోటి ఘనపు అడుగులు/తౌసండ్ మిలియన్ క్యూబిక్ పీట్) నుండి 2022 నాటికి 256 టీఎంసీలకు పెరిగింది. "సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ" తెలిపిన లెక్కల ప్రకారం 1985, 1986 లో చదరపు కిలో మీటర్ వ్యవసాయ సాగు భూముల్లో 5 బావులు ఉండగా, 2016, 2017 నాటికి 18 నుండి 20 బావులకు పెరిగాయి. నిజంగా కూడా అనుకూలమైన వాతావరణ పరిస్థితుల వర్షపాతం, గోదావరి నది, కృష్ణ నది బేసిన్ ల ప్రాజెక్ట్ లు, బ్యారేజిలు, డ్యామ్ లు లిఫ్ట్ లు, గ్రామాల్లోని చెరువు కుంటలు నిండు గోళాలను తలపించినవి. దానితో భూగర్భ జలాలు పెరిగి కరంటు బావుల నీటి సేద్యంతో పాటుగా సాగు విస్తీర్ణం పెరిగి పంటలు సమృద్ధిగా పండినవి. కొన్ని గ్రామాలలోనైతే గొర్రె, మేక మేయడానికి కూడా బీడు భూమి కరువైంది. దానితో సాగు నీటి అవశ్యకత కూడా పెరిగింది. "ఏ ఇంటి నీళ్లు ఆ ఇంటి ఇంకుడు గుంతలో ఇంకిపోయేలా ప్రోత్సహించడంతో పాటుగా ఊర్లల్ల శివారుల నీళ్లన్నీ గొలుసు చెరువులు నిండేటట్లుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రానున్న కాలంలో భూతాపం తగ్గించుకోవడానికి, పర్యావరణ, జీవావరణ, జీవవైవిధ్యం పెరగడానికి చిన్న నీటి వనరులైన చెరువు కుంటలు, చెక్ డ్యామ్ లకు ప్రణాళికపరమైన ప్రాముఖ్యతను ఇవ్వాలి. గత ప్రభుత్వం చేపట్టిన "మిషన్ కాకతీయ చెరువుల పూడిక తీతకు దాదాపు రూ.8,700 కోట్లు ఖర్చు చేసి వెయ్యినోళ్ల ప్రశంసలను పొందినట్లుగా ప్రచారం చేసుకుంది. కాని వాస్తవంగా మిషన్ కాకతీయ పథకం మసిపూసి మారేడు కాయ చేసిన పథకం. బ్యూరాక్రసీ, పాలకులు కూడాబల్కొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఎందుకంటే? "చెరువులో పూడిక నిండిందదానికి కొలమానం"! గాడెం తూము కనిపించకుండా పూడిక కప్పబడి ఉండటం. కాని తెలంగాణలో ఉన్న 98 శాతం చెరువు, కుంటల గాడెం తూములు తేలి ఉన్నవి. యాసంగి (రబీ) పొలాల సమయంన చెరువులల్ల నీళ్లు మీది తూముకు అందకుండా ఎత్తిపోతే గాడెం తూము ద్వారా గూడతో నీళ్లు తోడుకొని కట్టెనుక పొలాలకు ఒకటి, రెండు తాళ్లు నీళ్లు పారించుకునే వారు. అదియుగాక ప్రతి వేసవి కాలంలో రైతులు పంట పొలాల భూసారం పెంచడానికి చెరువు మట్టిని ఎడ్ల బండ్లతో, ట్రాక్టర్ లతో రవాణా చేసుకునేవారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ లో నిర్వహించిన "జన్మభూమి, శ్రమదానం" కార్యక్రమాలలో కూడా చెరువుల మట్టిని పంటపొలాల్లో పోసుకున్నారు. తెలంగాణ చెరువులలో పూడిక నిండే అవకాశాలు తక్కువ. ఎందుకంటే? దాదాపు చెరువులన్నీ శివారు భూములు, గుట్టలు, బండలు, గ్రామ ఆవాసాల నుండి వచ్చిన వర్షపు నీళ్లతో నిండే చెరువులే ఎక్కువగా ఉన్నవి. దాదాపుగా వాగు (చిన్నపాటి నది) నీళ్ల ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన చెరువులు తక్కువగా ఉన్నవి. "ఎద్దు ఈత పడే వరద నీళ్ల ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన చెరువులు అరుదుగా ఉన్నవి. కాబట్టి చెరువు పూడిక తీసే పనులు అవసరం లేదు. ఇప్పుడు ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు పూనుకోవాలి. అందులో 1) చెరువు కట్టలపై ఏపుగా పెరుగుచున్న పిచ్చి చెట్లను, పట్నం తుమ్మ చెట్లను, భారీ వృక్షాలను పెరగకుండా చర్యలు తీసుకోవాలి. 2) వర్షపునీటితో చెరువు కట్టలు మట్టి కోతకు గురికాకుండా పశుగ్రాసం, ఎంపలి, తంగేడు చెట్లు పెరిగేటట్లుగా చేయాలి. 3) తూముల నుండి చెరువు నీళ్లు లీక్ కాకుండా బ్రాస్, స్టీల్ స్పిండిల్ వాల్వులను అమర్చాలి. చెరువుల మత్తడిపై, మత్తడి లోపలి వైపు మాబీర, బేసేరం లాంటి పిచ్చి జంగల్ పెరగకుండా నియంత్రించాలి. 4) అవసరం ఉన్న దగ్గర వాన వరదను చెరువులోకి మళ్లించడానికి పీడర్ చానల్ ను నిర్మించాలి. 5) నీటి లభ్యత గుర్తించి వాగులపై, ఒర్రెలపై పేర్కొలేషన్ ట్యాంకులు, చెక్ డ్యామ్ లను నాణ్యతగా నిర్మించాలి. ప్రస్తుత అత్యవసర పనుల నిర్వహణగా దుద్దెనపల్లి మామిడి చెరువు తూము నీళ్ల లీకేజీని బంద్ పెట్టించి, గ్రామాల వారీగా ఉన్న చెరువుల తూములను కూడా పర్యవేక్షింప చేయాలని ప్రజలు కోరుతున్నారు.



✍ మేరుగు రాజయ్య
దుద్దెనపల్లి, సైదాపూర్
9441 440 791

## అసత్య ప్రచారాలు చేసేవారిపై..

మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభద్రతా భావానికి గురి చేస్తున్నారని ఇకపై అలాంటి దుష్ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని స్పష్టం చేశారు. అంతేగాక ప్రత్యేకంగా ఒక ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసి వాస్తవాలేమిటో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. అమరావతి మునిగిపోయిందని విజయవాడ ప్రకాశం బ్యారేజి గేట్లు పనిచేయడం లేదని పలు అసత్య ప్రచారాలను సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రసారం చేస్తూ ప్రభుత్వంపై మూకుమ్మడి దాడి చేస్తున్నారని ఇకపై అలాంటి తప్పుడు వార్తల ప్రసారాలను సమర్ధవంతంగా తిప్పకొట్టడం తోపాటు అందుకు కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి అనిత స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ విజయవంగా అమలు చేయడంతో ప్రతిపక్షపార్టీ తట్టులేక పోతోందని అందుకే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని చేస్తోందని హోం మంత్రి అనిత విమర్శించారు. ఇది ఆపార్టీకి వారసత్వంగా వచ్చిన సమస్యగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ఒక్క ఆగష్టు నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నేతన్నలకు, నాయి బ్రాహ్మణులకు 200 వరకూ ఉచిత విద్యుత్, స్త్రీశక్తి పథకం కింద మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని అన్నారు. నాలుగు రోజుల్లో సుమారు 20 లక్షల మందికి పైగా మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణించి సుమారు 20 కోట్ల రూ.ల వరకూ లబ్ది పొందారని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంటే ఎపి బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బతీసే విధంగా ప్రతిపక్ష వైసిపి వారి అనుబంధ మీడియా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అనిత పేర్కొన్నారు. ఎపి బ్రాండ్ ఇమేజ్ గురించి మాట్లాడాలంటే ముందుగా గుర్తువచ్చేది సియం చంద్రబాబు నాయుడేనని అలాంటి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడమేమిటన్నారు. అమరావతిపై లేనిపోని రాతలు రాసేవారిపై కేసులు పెడతామని ఆనాడు రఘురామ కృష్ణ రాజుపై కాదు ఈనాడు మీరు పెడుతున్న తప్పుడు పోస్టులపై రాజద్రోహం కేసులు పెట్టాలని అన్నారు. ఇకపై ఇలాంటి తప్పుడు పోస్టులు పెట్టవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సియం స్పష్టం చేశారని మంత్రి అనిత పునరుద్ఘాటించారు. అసాంఘిక శక్తులను ఎలా అరికట్టాలో చంద్రబాబుకు బాగా తెలుసని అలాంటి శక్తులపై ఉక్కుపాదం మోపుతామని శాంతిభద్రతల విషయంలో రాజీలేదు హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.


**శ్రీకాంత్ అనే వ్యక్తి పెరోల్ రద్దు చేశాం - ప్రస్తుతం జీవితఖైదు అనుభవిస్తున్నాడు : మంత్రి అనిత**

పెరోల్ రావడం వెనుక ఏముంది ఎవరున్నారనే దానిపై పూర్తిగా విచారణ జరుపుతున్నామని ఈసంఘటనలో ఎవరున్నా వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. శ్రీకాంత్ విషయంలో ఎస్కార్ట్ సిబ్బందిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రిమినల్ రికార్డు ఉన్న వ్యక్తికి పెరోల్ వచ్చిందని జైలు అధికారి చెప్పారని వెంటనే అతని పెరోల్ రద్దు చేసి తిరిగి జైలుకు పంపామని అన్నారు. ఈఘటనలో పోలీస్ అధికారులు ఎవరున్నా వారిపై కూడా విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అరుణ అనే మహిళ దిశా ఫౌండేషన్ కు సెల్ఫ్ డిక్లేర్డ్ సెక్రటరీ అని ఆమె నుంచి హోంశాఖ పేషీకి ఫోన్ వచ్చిందని దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆమె గురించి ఆమె వెనుకున్న వారి గురించి ఆరా తీస్తున్నాని తెలిపారు.

# 22వ తేదీన తెలంగాణ రాష్ట్ర బంద్

- గో బ్యాక్ మార్వాడి బచావో తెలంగాణ జోరు అందుకున్న నినాదం...
- ఉస్మానియా జెఎసి బంద్ పిలుపు...
- తెలంగాణ సమాజం గో బ్యాక్ మార్వాడి బచావో తెలంగాణ నినాదాన్ని చేపట్టి ఉద్యమిస్తున్న తీరు..
- హైదరాబాదులో రోహింగ్యాలను వెళ్ళగొట్టడం ఎవరి పని..
- సోషల్ మీడియాలో మార్వాడీల గో బ్యాక్ అంటే రోహింగ్యాలను పాకిస్తాన్ వాళ్ళను వెళ్ళగొట్టండి అంటూ బూతు మాటలు...
- కొందరు హిందువుల మీద మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు అంటూ మండిపాటు..
- అసలు మార్వాడీలకు రోహింగ్యాలకు ఏంటి సంబంధం..?

జయభేరి, హైదరాబాద్ :




గత కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో మరో ఉప్పెనల గో బ్యాక్ మార్వాడి కల్చర్ మార్వాడి అంటూ అనేక నియోజకవర్గాల్లో తెలంగాణ పల్లెల్లో కూడా గో బ్యాక్ మార్వాడి ఉద్యమం రూపు దాల్చుతుంది. ఇక ఎల్బీనగర్ వేదిక సాక్షిగా ఆనాడు మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఎలా పురుడు పూసిందో అక్కడి నుంచే మళ్లీ గో బ్యాక్ మార్వాడి ఉద్యమం బచావో తెలంగాణ అంటూ మరో ఉద్యమం రూపుదాలుస్తోంది... ఇదిలా ఉంటే కొంతమంది పనిగట్టుకున్న శాటిలైట్ ఛానల్ దగ్గర నుంచి యూట్యూబ్ ఛానల్ వాళ్ళు భారతీయులు కాదా ఇక్కడ బతుకుద్దా మీరెవరు? అంటూ గో బ్యాక్ మార్వాడి వ్యవస్థ పై మాట్లాడుతున్న వారిని దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోంది! ఇక మరి కొంతమంది సోషల్ మీడియాలో ముందు రోహింగ్యాలను వెళ్ళగొట్టండి ఆ తరువాత పాకిస్థాన్ లో వెలగొట్టండి అంటూ తెలియక బూతు మాటలు మాట్లాడుతున్నారు.

**రోహిన్యాలను దేశంలో నుంచి మన రాష్ట్రంలో నుంచి ఎవరు వెళ్లగొట్టాలి.**

రాజ్యాంగపరంగా శాసనము ద్వారా నిర్మితమై రాజ్యాంగం మీద ప్రమాణం చేసి దేశ రక్షణకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా బావ బేధాలు లేకుండా పరిపాలన చేస్తానని ప్రతిజ్ఞ చేస్తూ అధికారాన్ని దక్కించుకున్న ప్రతి రాజకీయ పార్టీ దీనికి సమాధానం చెప్పాలి. గత పదేళ్లుగా దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారాన్ని దక్కించుకుంది.. ఓటు బ్యాంకు కోసమే పనిచేస్తున్నట్టుగా జై భారత మాత వందేమాతరం హిందూ మతం ఇలా భావోద్వేగమైన వాటిని ప్రధానంగా సమాజంలోని యువతకు అంటగట్టి ఆయుధాలుగా వాడుకుంటుంది... నిజానికి దేశంలో రాష్ట్రంలో రోహింగ్యాల చొరబాటు 10 సంవత్సరంలో ఎంతమంది మన దేశంలో చొరబడ్డారు? ఇక హైదరాబాదులో 20వేల నుంచి 60 వేల వరకు రోహింగ్యాలు ఉన్నారని వార్తలు తెలుస్తున్నాయి.. అయితే గత పది సంవత్సరాల నుంచి బిజెపి ప్రభుత్వం హోంశాఖ నిద్రపోతుందా... రోహింగ్యాలను వెళ్ళగొట్టాలని చెబుతున్న బిజెపి పార్టీ కేంద్ర మంత్రుల దగ్గర నుంచి సాధారణ యువత దీనికి సమాధానం చెప్పాలి.. బిజెపి పార్టీ కేంద్ర సహాయ మంత్రిగా పనిచేస్తున్న బండి సంజయ్ రోహింగ్యాలను ముందు వెళ్లగొడుదాం పాకిస్థాన్ వెళ్ళకూడదు అంటూ రెచ్చగొట్టే మాటలను యువతకు ప్రేరేపించే మాటలు మాట్లాడుతూ కాలయాపన చేస్తున్నాడే కానీ బిజెపి ప్రభుత్వం రోహింగ్యాలను ఎందుకు భారతదేశంలోకి వచ్చేలా చూస్తోంది వచ్చిన వారిని ఎందుకు పసిగట్టి పట్టుకోలేక పోతుంది అని మాత్రం ఎవ్వరు అర్థం చేసుకోలేకపోతున్నారు. రోహింగ్యాలను పట్టుకోవడం జనాల పనా..? హోం శాఖ మంత్రి కేంద్ర హోంశాఖ ఏం పని చేస్తున్నాయి నిఘా వ్యవస్థ ఏం పని చేస్తుంది పోలీసు రక్షణ శాఖ ఏం పని చేస్తుంది అని అడిగే వాడే కరువైపోతున్నాడు..

**ఇక హిందూమతం హిందూ పండుగలు.. ఈ విషయంపై మాట్లాడితే సదరు ఓ ప్రైవేట్ ఛానల్ యాంకర్ 84% హిందువులు ఉన్నారు హిందూ మనోభావాల దెబ్బతీయద్దు అని అంటున్నారే కానీ అసలు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాల్లో ఉన్న కల్చర్ ఏంటి అనేది మాత్రం తాను వివరించలేకపోతున్నాడు. తెలంగాణలో బాగోతం దసరా బతుకమ్మ బోనాలు ఇలా ఈ రాష్ట్రానికి కొన్ని ప్రత్యేకమైన పండుగలు సంస్కృతి సాంప్రదాయాలు ఉన్నాయి... జై శ్రీరామ్ అంటేనే హిందువు కాదు కదా... ఎల్లమ్మ సమ్మక్క సారక్క దేవతలను పూజిస్తున్న వాళ్ళు హిందువులు కాదా... అంటే బిజెపి ప్రభుత్వం కొంతమందిని హిందువులు అన్నట్టుగా చిత్రీకరిస్తూ ఇలా మాట్లాడిన వాళ్లందరినీ హిందూ వ్యతిరేకులుగా చత్రీకరిస్తూ తన రాజకీయ భవిష్యత్తును బలంగా చేసుకోవడానికి మతం పేరున పునాదులను పటిష్టం చేసుకోండి... నిజానికి ఉత్తరాది వ్యాపారస్తులు నిజాం కాలం నుంచి తెలంగాణలోకి ఎలా జొరబడ్డారు అన్న చరిత్రను ఈ మీడియా ఛానల్లు ఎందుకు బయటకు తీసుకురావడానికి వెనుకడుగు వేస్తున్నాయి.... ఆనాడు నిజాం ప్రభుత్వం తెలంగాణ వాళ్లు వ్యాపారం చేసుకోవడం ఇష్టం లేని ఆ రాక్షసుడు ఉత్తరాది నుంచి మార్వాడీలను గుజరాతీలను ఇక్కడికి రప్పించుకొని వ్యాపారాన్ని చేయించుకునేలా చేయలేదా? మార్వాడీలను గో బ్యాక్ అంటే హిందూ మతానికి వచ్చిన ఆపద ఏంటి? హిందూ మతానికి మార్వాడికి సంబంధం ఏంటి? చేనేత వృత్తుల దగ్గర నుంచి బంగారు ఆభరణాల తయారు చేసే కుటుంబాలను చిన్నచిన్న కిరాణా షాపులను హార్డ్వేర్ షాపులను టైల్స్ షాపులను మన తెలంగాణ వాళ్లు పెట్టుకుంటే ఓర్వలేని సదరు సిండికేట్ గుజరాతి మార్వాడి వ్యాపారస్తులు చేసే అరాచకాలు మీడియా దృష్టికి రాలేకపోవడంతో నేనా తెలిసి తెలియక మీడియా పేరు చెప్పకొని దబయించి మాట్లాడినంత మాత్రాన అబద్ధం నిజం అవుతుందా...**

నిజానికి గుజరాతీయులు మార్వాడీలు మేమిక్కడే పుట్టాము మేము భారతీయులం కాదా అంటూ చెప్పుకొస్తున్నారు. సరే మంచిదే మరి ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి 50 సంవత్సరాలు వచ్చిన వాడికి కనీసం తెలంగాణ భాష తెలంగాణ పాట బతుకమ్మ బోనాల ఆట ఎందుకు రాదు... తెలంగాణ పాట ఒక జానపద గేయం పాడగలుగుతాడా.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ పాటను పాడగలుగుతాడా.? వందేమాతరం అంటేనే వాడు భారతీయుడు అని నిర్వచనం ఇస్తున్న బిజెపి పార్టీ మరి తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర గీతం పాడని వాడు తెలంగాణ వాడు ఎలా అవుతాడు అని ఈ సమాజం ప్రశ్నిస్తోంది?



కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు, రచయిత, సామాజిక ఉద్యమకారులు

**హిందూ మతం అంటే భారతదేశం లో 90% ఉన్న మాట వాస్తవమే.. గో బ్యాక్ మార్వాడి గో బ్యాక్ మార్వాడి వ్యాపారం అంటూ నినదించినంతమాత్రాన హిందూ మతానికి వచ్చిన ఆపద ఏం లేదు... కొన్ని దశాబ్దాల కాలం నుంచి తెలంగాణ బానిస బతుకుల కింద నలిగి వేసారి విసిగి పోరాటాలు చేసి ప్రాణాలు పోగొట్టుకొని తెగించి కొట్లాడి స్వరాష్ట్రాన్ని సంపాదించుకున్నారు. మతం పేరును కులం పేరును రాష్ట్రాన్ని సాధించుకోలేదు.. మన భాషను వెక్కిరించి మన యాసను వెక్కిరించి మన ఉనికిని వెక్కిరించి మన ఆత్మ గౌరవం మీద దెబ్బ కొట్టిన ఆంధ్ర పెత్తనాన్ని పాలనను జీర్ణించుకోలేక ప్రాణాలు తీసుకొని ఆత్మ బలిదేగాలు చేసుకుని రాష్ట్రాన్ని సాధించుకున్నారు.. తెలంగాణ రాష్ట్ర భౌగోళిక ముఖచిత్రం సాంస్కృతి సాంప్రదాయాలు కనీసం వివిధ ఛానల్ లో పనిచేసే వాళ్ళకి తెలియకపోవడం బాధాకరం... బతుకమ్మ పండుగకు ఉన్న ప్రత్యేకత బోనాల పండుగకు ఉన్న ఆదరణ సమ్మక్క సారక్క పండుగలకు ఉన్న పవిత్రత ఈ మార్వాడి గుజరాతి సోకాళ్ళు వత్తాసు పలుకుతున్న పెద్దలకి ఏం తెలుసు? సమ్మక్క సారక్క దేవతల అని ప్రశ్నించిన ఆ సనాతన ధర్మాన్ని భుజాన వేసుకుంటున్న పెద్దలే మాట్లాడినప్పుడు మరి హిందూ మత పెద్దలంతా నిద్రపోతున్నారా? ఇలా చెప్పకుంటూ పోతే ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయి కచ్చితంగా తెలంగాణ రాష్ట్రం నుంచి మార్వాడి వ్యవస్థ మార్వాడి వ్యాపారం పూర్తిగా తెలంగాణ నుంచి వెళ్లి పోవాల్సిందే... వ్యాపారాన్ని కొల్లగొట్టి నకిలీ వస్తువులను ప్రజలకు అంటగట్టి తెలంగాణ ప్రజలను నిండా ఆర్థికంగా ముంచేసే ఇలాంటి వాళ్లను ఎందుకు వెనుకేసుకొస్తున్నారు తెలంగాణ ప్రజలు ఒక్కసారి మననం చేసుకోవాలి....**

భారత దేశంలో ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఎక్కడైనా బ్రతకవచ్చు వ్యాపారం చేసుకోవచ్చు. కానీ తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకమైనది విలక్షణమైంది ఆత్మగౌరవంతో బతుకుతుంది అస్తిత్వం మీద దెబ్బ కొడితే సొంత కొడుకు అయినా సహించేది లేదనేది తెలంగాణ ఆత్మ గోశ... నరనరాన ఉద్యమ పోరాట స్పూర్తితో 60 ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. మరి ఈ పదేళ్ల కాలంలో గుజరాతి మార్వాడీల వ్యాపారం అహంకారం తారస్థాయికి చేరింది కనుకనే ఇవ్వాలా ఎంతోమంది కులవృత్తుల కడుపులు మాడిపోయాయి గుళ్ళు చెదిరిపోయాయి... భాగ్యనగరంలో అనేక విలువ గల ఏరియాలలో ఇల్లు అమ్ముకొని పోయేలాగా వాళ్ళ జీవితాలను చిద్రం చేసి ఇవ్వాలా ఆస్తులను కూడగట్టుకున్న మార్వాడి గుజరాతి సిండికేట్ దందాను బయట పెట్టినందుకు ఇవ్వాలా మన తెలంగాణ వాదులకే అంత జాలి కలుగుతుంది అంటే అది వారి అవివేకం వెర్రితనం.... రోహింగ్యాల పేరుతో మార్వాడీలను గుజరాతీలను ఉత్తరాది ప్రాంత వాసుల వ్యాపారాలను వెనకేసుకొస్తున్న సోకాళ్ళు పెద్దలు ఒకసారి ఆలోచించండి. నగరంలో రోహింగ్యాలను వెళ్ళగొట్టడం మన పని కాదు చట్ట సభల్లో హోం శాఖ మంత్రిగా పదవులు తీసుకుని రక్షణ నిఘ వ్యవస్థల పని అది.. కచ్చితంగా రోహింగ్యాలను దేశం నుంచి తరిమి కొట్టాలి. మరి ఆ పని కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఎందుకు చేయడం లేదు. కేంద్ర మంత్రులుగా పనిచేస్తున్న వాళ్లు ఎందుకు ప్రజల మీద రోహింగ్యాల విషయాన్ని రుద్దుతున్నారు... ఇది కూడా అర్థం చేసుకోలేని తెలంగాణ సమాజం ఒక్కసారి కళ్ళు తెరవాలి...

22 తారీకు ఉస్మానియా జేఏసీ తెలంగాణ బంద్కు పిలుపునిస్తున్న నేపథ్యంలో తెలంగాణ సమాజం మొత్తం గో బ్యాక్ మార్వాడి తెలంగాణ బచావో అన్న నినాదానికి మద్దతు తెలపాలి.. ఇది మరో తెలంగాణ ఉద్యమం కాకపోవచ్చు. కానీ కులం పేరుతో ఆత్మ గౌరవం మీద దెబ్బ కొట్టిన ఉత్తరాది అహంకారాన్ని కచ్చితంగా దెబ్బ తీయాలి తెలంగాణ నుంచి తరిమికొట్టాలి... తెలంగాణ ద్రోహి ఎవ్వడైనా సరే తెలంగాణలో ఉండడానికి వీల్లేదు. తెలంగాణ ఆర్థిక స్థితిగతులపై మూలాలపై దెబ్బ కొట్టడమే కాకుండా మన రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఎంపీల ఎన్నికలపై కూడా వీళ్ళ ప్రభావం ఎక్కువగా పడుతుంది. దీనిపై ఎవరూ స్పందించడం లేదు.... ఇది పోరాట స్ఫూర్తితోనే సాధ్యమవుతుంది ఏ ఒక్కరోజో నైలో సంవత్సరము కాదు. నిజాం కాలం నుండి వలస వచ్చిన మార్వాడి వ్యవస్థను తరిమికొట్టడం మరో తెలంగాణ ఉద్యమానికి నాంది పలకాల్సిన సమయం..

---



## సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ASP మౌనిక సూచనల మేరకు పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో మహిళ పోలీసుల కు సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం ను RK సేవా ఫౌండేషన్ ఉప అధ్యక్షులు కరాటే మాస్టర్ చిత్తనూరి శ్రీను ఈ రోజు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో RK సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్న రామకృష్ణ పాల్గొని SI మౌనిక SI సాలకమ్మ ల ని కృతజ్ఞతలు తెలిపి, వారి సమక్షంలో ఇటీవల విడుదల అయిన కూలి సినిమాలో ఫైటర్ పేరు తెచ్చుకున్న జాగటి ఆకాష్ మరియు ఇండియా నేపాల్ T20 క్రికెట్ టోర్నమెంట్లో ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు పొందిన వెంకటేష్ ను సన్మానం చేయడం జరిగింది. అనంతరం ట్రైనింగ్ వచ్చిన మహిళా పోలీసుల కు ఫౌండేషన్ వారు పండ్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు అన్వార్, ప్రధాన కార్యదర్శి పొట్ల విజయ్ కుమార్, ఉమేర్, మాకబుల్, టీ ప్రతాప్, గుండాల వెంకట్ యాదవ్, అంజి, శివ రామరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండలో నిర్వహించినటువంటి ప్రోగ్రాం ముఖ్యఅతిథిగా విచ్చేసిన కడారి అంజయ్య యాదవ్ వారి సొంత భూమిని 300 గజాలు దేవరకొండ ఫోటో వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి బహుమతిగా వారి సేవ దాతృతతో వారికి అందజేయడం జరిగినది. దేవరకొండ ఫోటోగ్రాఫర్ యూనియన్ తరఫున వారికి ఎనలేని గుర్తింపు గా దేవరకొండ వారు ఆ యొక్క భవనానికి వారి పేరుని చిరస్థాయిగా ఉండాలని తీర్మానం చేసుకోవడం జరిగింది. కార్యక్రమంలో దేవరకొండ అధ్యక్షులు కానుగుల ఆంజనేయులు కార్యదర్శి పులిజాల భాస్కర్ గౌరవ అధ్యక్షులు నీలా సంజీవ కుమార్, రాష్ట్ర కార్యదర్శి సమదం జయరాములు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు పసుపులేటి కృష్ణ, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట మోహన్ రెడ్డి, నల్గొండ జిల్లా కోశాధికారి మేదరి భాస్కర్, నల్లగొండ జిల్లా సభ్యులు పున్న రామకృష్ణ , మూషం లక్ష్మణ్ కుమార్ నేత, దేవరకొండ సభ్యులు మణిదీప్, సందీప్, గణేష్, రాము, జగదీష్, ఊరుకొండ రాజు, సముద్రాల వేణు, పగిడిమర్రి శివ, హాథిరాం, కేతావత్ రవి, సంగిశెట్టి జోత్స్నా , ఫోటోగ్రాఫర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల కోసం వలస ఆదివాసీల జీవితాలతో చెలగాటం ఆడితే సహించం

- వలస ఆదివాసులకు కులం సర్టిఫికెట్లు ఇవ్వాలి
- వలసది వాసుల బ్రతుకులు నాశనం చేసిన బిఆర్ఎస్ నీ ఎన్నికల్లో వలస ఆదివాసులకు ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ ను వచ్చే ఎన్నికల్లో ఆదివాసులు చిత్తుచిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలి
- బీఎస్పీకి భద్రాచల నియోజకవర్గంలో అధికారం ఇవ్వడం ద్వారా వలస ఆదివాసి ప్రజల సమస్యలు పరిష్కరించబడతాయి
- గుర్రాల దుర్గ భవాని బిఎస్పి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి



జయభేరి, చర్ల, ఆగస్టు 19 :

చర్ల మండలంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వలస ఆదివాసి గ్రామాలను పర్యటించడం జరిగింది ఈ సందర్భంగా సింగసముద్రం గ్రామంలో ని ప్రజలతో మాట్లాడటం జరిగింది అనేక సమస్యలు పార్టీ దృష్టికి ప్రజలు తీసుకరావడం జరిగింది ఈ పర్యటనలో బహుజన సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి గుర్రాల దుర్గాభవాని పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో వలస ఆదివాసుల కులం సర్టిఫికెట్లు రద్దు చేయడం వల్ల కొత్త సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల భద్రాచల నియోజకవర్గం లోని వలస ఆదివాసి బిడ్డల బ్రతుకులు నాశనం అవుతున్నాయని ఆదివాసి విద్యార్థుల చదువులు ఆగమవుతున్నాయని ఆదివాసి బిడ్డలు ఉద్యోగాలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆదివాసి బిడ్డలకు ఈ రకమైన నష్టానికి కష్టానికి కారణం గతంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ నాయకత్వానికి వలస ఆదివాసుల ఉసురు తప్పకుండా తగులుతుందని అన్నారు ఎన్నికల్లో వలస ఆదివాసులకు కులం సర్టిఫికెట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ఏమాత్రం కూడా ఈ సమస్య పరిష్కారం కోసం పనిచేయడం లేదని విమర్శించారు ఓట్ల కోసం కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలు వలసాదివాసుల బ్రతుకులతో చెలగాటం ఆడుతున్నయనీ తక్షణమే వల సాధి వాసుల చుట్టూ కాంగ్రెస్ టీఆర్ఎస్ కు ఆడుతున్న నాటకాన్ని నిలిపివేయాలని లేకుంటే బహుజన సమాజ్ పార్టీగా ఊరుకోమని హెచ్చరించారు ఆదివాసీలు వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఆదివాసులను భూమి నుంచి వేల్లగొట్టడం కోసం గతంలో బిఆర్ఎస్ చేసిన కుట్ర ఫలితమే ఈరోజు ఆదివాసులు పడుతున్న బాధలకు నిదర్శనం అని మండిపడ్డారు ఫిఫ్త్ షెడ్యూల్ లోని చట్టాలను ఏమాత్రం లెక్కచేయకుండా పాటించకుండా ప్రభుత్వాలు వ్యవహరించడం వల్లనే ఆదివాసి చట్టాలు అమలకు గౌరవానికి నోచుకోవడం లేదని వాపోయారు బీఎస్పీ మాత్రమే భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తుందని భారత రాజ్యాంగ రక్షణకై ఉద్యమిస్తుందని తెలిపారు భద్రాచల నియోజకవర్గంలోని ప్రాంతం అభివృద్ధి కావాలంటే గిరిజన చట్టాలకు రక్షణ ఉండాలంటే బీఎస్పీకి బహుజన జాతులైన ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలు ఐక్యమై బిఎస్పీకే అధికారం ఇవ్వాలని అన్నారు భద్రాచలం నియోజకవర్గం నుండి బీఎస్పీ అధికారంలోకి వస్తే వలస ఆదివాసుల సర్టిఫికెట్లు సమస్య పరిష్కారం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు సామల ప్రవీణ్, చర్ల మండలం బిఎస్పి అధ్యక్షులు గోగికర్ రామ లక్ష్మణ్ చర్ల మండలం బి ఎస్ పి ఉపాధ్యక్షులు కొండా కౌశిక్, బీఎస్పీ చర్ల మండలం కార్యదర్శి గుర్రాల విజయ్ కుమార్, చెన్నం మోహన్, జహీరుద్దీన్ భాష, ఉప్పరగూడెం సెక్టార్ కార్యదర్శి మొడేమ్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట కు మూడు ఐ ఎస్ ఓ, గుడ్ గవర్నన్స్ సర్టిఫికెట్స్

- దేశంలోనే ఎనర్జీ ఆడిట్ ను నిర్వహించిన తొలి ఆలయంగా యాదగిరిగుట్ట
- డిప్యూటీ సి.ఎం చే అందుకున్న ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, గుట్ట ఈ.ఓ వెంకట్ రావు.

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 19 :

యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ ఆలయానికి నాలుగు ISO 9001, ISO 22000 లతో కలిపి నాలుగు సర్టిఫికేషన్ పురస్కారాలు యాదగిరి గుట్ట లయానికి లభించాయి. దేశంలోనే ఎనర్జి ఆడిట్ నిర్వహించిన మొట్ట మొదటి ఆలయంగా, స్వామివారి అన్న, ప్రసాదాల విషయంలో అత్యంత ఉన్నత ప్రమాణాలు, గుట్ట సందర్శనకు వచ్చే యాత్రికులకు మెరుగైన, సంతృప్తికర సౌకర్యాలు కల్పించడం, భక్తులకు సంతృప్తికరమైన దైవ దర్శనం కల్పించడం, తదితర అంశాలకు ఈ నాలుగు అవార్డులు లభించాయి. గత రెండు నెలలుగా విజయవంతంగా ఐఎస్ఓ ఇన్స్పెక్షన్ సర్టిఫికేషన్, ఆడిట్ ను HYM ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ఆధ్వర్యంలో గుట్టలో నిర్వహించారు..

ఈ ISO సర్టిఫికెట్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దనసరి అనసూయ, సి.ఎస్ రామకృష్ణా రావు ల సమక్షంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎండోమెంట్ కమీషనర్, యాదగిరిగుట్ట కార్యనిర్వహణాధికారి వెంకట్ రావు లకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్ బాధ్యులు ఆలపాటి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.



## నానో యూరియా పై అవగాహన సదస్సు

జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 19 :

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి రైతు వేదిక నందు, గొల్లగూడెం, పల్లె పహాడ్ గ్రామాల్లో నానో యూరియా పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ లు మాట్లాడుతూ నానో యూరియా 500 ml ఒక ఎకరాకు పై బాటుగా వేసుకోవాలని తెలిపారు .నానో యూరియా వాడకం ద్వారా రసాయన ఎరువులు వాడడం తగ్గించి రైతులకు ఆదాయం పెంచుతుందని, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని,అధిక దిగుబడి పొందుటకు తోడ్పడుతుందని అన్నారు. నానో యూరియాలతో నిల్వ ,రవాణా చేయటం కూడా సులభం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు జెస్సి ,తిరుమలరావు, దివ్య, రాకేష్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, రైతులు శ్రీనివాస్ రెడ్డి, భగవంత్ ,ఇస్తారి, ఎరుకల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలి



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 19:

లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని హౌసింగ్ పీడీ విజయ్ సింగ్ అన్నారు మంగళవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 141 మంది లబ్ధిదారులకు 90 మంది ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించినట్లు తెలిపారు. మిగతా 51 మంది లబ్ధిదారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ శ్రీరాములు, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరేష్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, వాసాలమర్రి పంచాయతీ కార్యదర్శి ఒగ్గు మధు, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, బాలరాజు, కొండయ్య, జ్యోతి, పద్మజా, అల్తాఫ్, కరోబార్ పలుగుల ప్రశాంతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 19:**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని శ్రీ రామాలయం పక్కన పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం నిర్వహిస్తున్నట్లు విగ్రహ దాత కోల సుగుణమ్మ ఆంజనేయులు తెలిపారు. బుధవారం వరుణనయానం ,కలశ స్థాపన, అఖండ దీపారాధన ,గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణము, సర్వతో భద్ర మండలం, వాస్తు మండలం, మాతృకో మండల స్థావనం, అగ్ని ప్రతిష్ట, జలాధివాసం, షోడషావచార పూజ, హారతి ,ఆంజనేయ స్వామి విగ్రహం గ్రామంలో ఊరేగింపు సాయంకాల పూజ ఆవనం, షయ్యదివాసం ,గురువారం రోజున సాపిత దేవత హవనం ,మూల మంత్ర జపం ,కుంభాభిషేకం, గర్త సంస్కారం ,యంత్ర ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమాన్ దీక్ష పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ, శ్రీ పాండురంగ ఆశ్రమ నిర్వాహకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## గంధమల్ల చెరువుకు పూజలు చేసిన ప్రభుత్వ విప్



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 19:**

తుర్కపల్లి మండలం గంధ మల్ల చెరువు నిండి అలుగు పోయడంతో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్లు ఐలయ్య గంగమ్మకు చీర, కుంకుమ, పసుపు, సమర్పించి హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో రైతులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వర్షాలు లేని సమయంలో సగము చెరువులను నింపడంతో పాటు మిగతా చెరువులు నింపడం జరుగుతున్న సమయంలో వరుణ దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా పడి చెరువులని నిండి అలుగులు పారడం జరిగిందని అన్నారు. రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ చేయమని అన్నారు. రైతుల అవసరాలకు ఎరువులను అన్ని అందుబాటులో ఉంచినట్లు రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేసి, అనుక్షణం కృషి చేస్తుందని అన్నారు. గత పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు లేని ప్రతి ఇంటికి రేషన్ కార్డులను అందిస్తున్నట్లు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేంద్రరెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొత్త రాములు, రాజారాం నాయక్, పని గట్ల సుదర్శన్, జిల్లా ఓబీసీ కన్వీనర్ దేవరుప్పల ఐలయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంకేని వెంకటేష్‌గౌడ్, బీసీ మండల అధ్యక్షుడు రామగౌని వెంకటేష్, యూత్ అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల ఎల్లేష్ యాదవ్ ,తాసిల్దార్ దేశ నాయక్, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పిహెచ్ సి ఎదిర ఆధ్వర్యంలో ఆరోగ్య క్లినిక్ కార్యక్రమం



**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 19 :**

పిహెచ్ సి ఎదిర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో,హాస్టల్లో ఆరోగ్య క్లినిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ బాయ్స్ హాస్టల్ లో, చిరుతపల్లి బాలికల హాస్టల్ లో ని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటి ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టారు.ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా 74 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి నమూనాలు టీహబుకు పంపారు. దోమల నివారణ చర్యల కోసం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి ఈ ఓ కోటిరెడ్డి, డాక్టర్ ఆశిష్, డాక్టర్ పవన్, ఏ జ్యోతి ,పి హెచ్ ఎన్ యాకమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# కేబుల్, ఇంటర్నెట్ సేవలు బంద్

- గుండ్లపోచంపల్లిలో కేబుల్ వైర్ల తొలగింపు..
- తీవ్ర నష్టం వాటిల్లిందని ఆపరేటర్ల ఆవేదన

**జయభేరి, మేడ్చల్ :**

నగరంలోని రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణ శోభాయాత్ర సందర్భంగా విద్యుత్‌దాఘాతానికి గురై ఐదుగురు మృతి చెందిన నేపథ్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్ల తొలగింపునకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్, కేబుల్ టీవీ తీగలను విద్యుత్ సిబ్బంది ఎక్కడికక్కడే కట్ చేశారు. కాగా విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అన్యాయంగా కేబుళ్లను తొలగించడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని కేబుల్ ఆపరేటర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.






### ప్రాణాంతకంగా కేబుళ్లు

మున్సిపాలిటీ పరిధిలో ఏ కాలనీలో చూసినా సాలెగూళ్లను తలపిస్తున్న కేబుళ్ల కుప్పలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు వేలాడుతూ హైటెన్షన్ వైర్లపై నుంచి లాగి కనిపిస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయి. విద్యుత్ స్తంభాలపై కేవలం నాలుగు వరుసలతో మాత్రమే కరెంట్ తీగలు ఉంటే ఆ స్తంభాలపై 10 నుంచి 20 వరుసలతో కూడిన కేబుల్ వైర్లు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇంటర్నెట్, కేబుల్ నెట్ వర్క్ సంస్థలు ఇష్టారాజ్యంగా స్తంభాలకు కేబుళ్లను చుట్టేస్తున్నాయి.

ఇందుకు స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటి ఉల్లంఘన జరుగుతూనే ఉంది. దింతో ఆపరేటర్లు వాటిని తమ అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసి ఆ తర్వాత నిర్వహణ గాలికొదిలేయడంతో అవి గాల్లో వేలాడుతూ ప్రజలకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. కేబుళ్ల ఏర్పాటు, నిర్వహణ తదితర విషయాల్లో సమన్వయంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వశాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో క్షేత్రస్థాయిలో లైన్ల నిర్వహణలో పెద్దగా పట్టింపు కనిపించడం లేదు.

భారీ వాహనాలు వెళ్లే సమయంలో కిందకు వేలాడుతున్న కేబుళ్లు తెగి విద్యుత్ వైర్లకు తాకి మెరుపులు కూడా వస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత విద్యుత్, మున్సిపల్ సిబ్బంది అధికారులు ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేయడం తరువాత మరిచిపోవడం పరిపాటిగా తయారైందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



### తీవ్ర నష్టం వాటిల్లింది:
**నరేందర్ కేబుల్ ఆపరేటర్**

విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే టివి కేబుల్, ఇంటర్నెట్ వైర్లను పుర్తిగా తొలగించడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని గుండ్లపోచంపల్లి కేబుల్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి కేబుల్ వ్యాపారం చేస్తున్నామని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వైర్లు పూర్తిగా కట్ చేయడం సరికాదని ఆరోపించారు. కనీసం ముందస్తు సమాచారం ఇచ్చి కొంచెం సమయం ఇస్తే తామే సొంతంగా వైర్లను తొలగించే వాళ్ళమన్నారు. అధికారుల తీరుతో తమకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు.

### మరమ్మతులకు ఇబ్బంది పడుతున్న లైన్‌మెన్లు

నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్ సంస్థలు విద్యుత్ శాఖ స్తంభాలను తమ సొంతానికి వాడుకుంటున్నాయి. వాడవాడలా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తుండగా.. కొన్ని ప్రైవేటు ఇంటర్నెట్, కేబుల్ టీవీ సంస్థలు ఇష్టారాజ్యంగా కేబుళ్లను స్తంభాల ద్వారా అనుసంధానిస్తున్నాయి. ఫలితంగా విద్యుత్ స్తంభాల వద్ద ఏదైనా సమస్య ఎదురైతే ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేయలేకపోతున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు లైన్‌మెన్లు తనిఖీ చేసి మరమ్మతులు చేయడం సహజం. కాగా, ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన కేబుళ్లతో వారు స్తంభాలు ఎక్కాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉంటుందో తెలియని పరిస్థితి. తరచూ విద్యుత్ తీగల్లో స్పార్క్ వచ్చి తీగలు కాలి కేబుళ్లపై పడి మంటలు చెలరేగిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. స్తంభాలకు కుప్పలు తెప్పలుగా కడుతున్న కేబుల్ వైర్లతో విద్యుత్ సిబ్బంది మరమ్మతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# భారీ వర్షంలో నగర వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే శంకర్

- ప్రజా పాలనలో ప్రజల వద్దకే పాలకులు
- ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 19 :**

ఒకవైపు ఎడతెరిపి లేకుండా వర్షం.పట్టణ ప్రజలకు బయటకు రావాలంటేనే చిన్నపాటి భయం. ప్రజా పాలనలో ప్రజల వద్దకే ఎమ్మెల్యే.భారీగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పట్టణ అభివృద్ధికి నేను సై అంటూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో పర్యటించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటన సందర్భంగా రెండవ వార్డులోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే ముందు పెట్టారు. అన్ని సమస్యలను సావధానంగా వింటూ ప్రతి ఒక్క సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తానని వార్డు ప్రజలకు మాట ఇచ్చారు.



ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కూడా ఎమ్మెల్యే శంకర్ వెంట నడిచి మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో గల సమస్యలను పూర్తిగా తెలుసుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమ సమస్యలు వినడానికి, పరిష్కరించడానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను చూసి రెండవ వార్డులోని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. నాయకుడంటే ఇలాగే ఉండాలని అత్యవసర పరిస్థితులలో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికై కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి అభినందనీయమని అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ;ప్రజల సంక్షేమం మరియు పట్టణాభివృద్ధే నా ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని అన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మెరుగైన రోడ్డు రవాణా సౌకర్యం, సుఖవంతమైన ప్రయాణ వాతావరణం కల్పించడానికి కృషి చేస్తానని, షాద్ నగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య మాజీ కౌన్సిలర్లు రాజేందర్ రెడ్డి శ్రీనివాస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బచ్చలి నరేష్, అందే మోహన్ ముదిరాజ్, బచ్చలి రమేష్, ఖదీర్, రమేష్ గౌడ్, మాధవలు యాదవ్, శ్రీను నాయక్, మురళీమోహన్, మసూద్ ఖాన్, ముబారక్ అలీ ఖాన్, యాదగిరి, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.



## రిటైర్డ్ ఉద్యోగులకు రావాలసిన గ్రాడ్యూటీ, క్యమ్యూటేషన్ వెంటనే చెల్లించాలి

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ కార్యవర్గం ఆగష్టు మాసం నెలవారి సమావేశం జరిగినది. అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటివరకు వారికి రావాలసిన గ్రాడ్యూటీ, క్యమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాషేమెంట్ రూపాయలు దాదాపు 26 లక్షలనుండి 45 లక్షలవరకు చెల్లించవలసి వుంది వాటితో పిల్లల పెండ్లిళ్లు, ఇంటి నిర్మాణం, పిల్లల చదువులు మొదలగు ఖర్చులకొరకు ఎదిరిచూసి కొందరు పెన్షనర్స్ బాధపడి చనిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం చలించక పోవడం విచారకరం, గత ప్రభుత్వ విధానాలు నచ్చక ఈ ప్రభుత్వంను ఎన్నుకుంటే వీరు పాత వారిలాగానే నిరాశపారుస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేసినారు. ఇకనైనా పెన్షనర్స్ సమస్యలు అర్థం చేసుకొని తక్షణమే చెల్లించాలని ప్రభుత్వంను కోరినారు. గత కాలంలో ఎన్నడూ లేనివిధంగా 5 విడతల కరువు బత్యం బకాయి పెట్టడం మరీ విచారకరం.అనంతరం కోశాధికారి పంగునూరు లింగయ్య నెలవారి ఆర్థిక నివేదిక సమర్పించి ఆమోదం పొందినారు. ఈ కార్యక్రమంలో సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపా అధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, ఉపాధ్యక్షురాలు పడమటి శాంతకుమారి, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, కార్యదర్శురాలు గందం వసంత, జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబెర్ తాడిశెట్టి సుదర్శన్,ఆడిటర్ కాశిమల్ల చెన్నయ్య మరియు కార్యవర్గ సభ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం




**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని పురుష మృతదేహాన్ని ఉప్పల్ పోలీసులు గుర్తించారు. ఈ నెల 17న రాత్రి 11.30 గంటలకు రామంతపూర్‌లోని AVE మరియా పాఠశాలలో గుర్తు తెలియని పురుష మృతదేహం కనిపించింది, మృతుడి వయస్సు సుమారు 35 నుండి 40 సంవత్సరాల మధ్య, ఎత్తు 5.7, తెల్లటి టీ షర్ట్, నల్ల పెయింట్ ధరించి ఉంది. మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ఏదైనా మృతదేహాన్ని గుర్తించినట్లయితే దయచేసి ఉప్పల్ Ps 8712 662 697, G వెంకట్ రెడ్డి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కాంటాక్ట్ నంబర్ 8712 579 490ను సంప్రదించండి.

# తహసిల్దార్ కార్యాలయం ముందు రైతుల ధర్నా

**జయభేరి, గుడిపల్లి :**

భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రజల నుండి తీసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుడిపల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పీఏ పల్లి ఉమ్మడి మండల అధ్యక్షులు వల్లపురెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అంజిరెడ్డి మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వ హాయంలో భూ సమస్యల పరిష్కారానికై తీసుకువచ్చిన ధరణి సరిగా లేదని ధరణి పేరును రద్దుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చేసిన చట్టం పుల్ల ప్రజలకు ఎటువంటి జరగడం లేదని ఆరోపించారు. కేవలం పేరు మార్చారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. మండలంలో భూభారతి చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో భాగంగా భూ సమస్యలు పరిష్కారానికై ప్రజల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించారని, అట్టి దరఖాస్తులను కొన్ని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పరిష్కరించడం లేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన గుడిపల్లి మండలానికి భూ సమస్యల పరిష్కారం పట్ల అవగాహన లేని తహసిల్దార్ ను నియమించారని, మండల రెవెన్యూ అధికారులు రైతుల భూ సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి కొంత గడువును కేటాయించి, గడువు లోపల పరిష్కరించేటట్లుగా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. తాసిల్దార్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి రైతులకు మండల ప్రజలకు సేవలు అందించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని లేనియెడల భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మాజీ వైస్ ఎంపీపీ ముఖ్య సలహాదారులు అర్వపల్లి నరసింహ, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎర్ర యాదగిరి, సుధాకర్ గౌడ్, మహేందర్ రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# 40ఏండ్ల తర్వాత..?

రెండు సింహాలు తలపడితే చూడ్డానికి భలే ఉంటుంది. ఆ పోరాటంలో ఏ గెలుపూ మనకు ఆనందాన్నివ్వదు. కేవలం ఆ ఫైటే కావాల్సినంత కిక్కిస్తుంది. ఇలాంటి ఓ యుద్ధానికి వెండితెర సిద్ధమవుతున్నట్టు ఓ వార్త మీడియా సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించబోతున్నారు. దశాబ్దాల తర్వాత ఈ రెండు సింహాలు వెండితెర వేదికగా తలపడనున్నాయి. ఈ ఇద్దరినీ ఒకే కథలో భాగం చేసే సాహసం చేసిన దర్శకుడెవరో కాదు.. లోకేష్ కనకరాజ్. 'కూలీ'తో రజనీకాంత్‌కు భారీ విజయాన్ని కట్టబెట్టిన లోకేష్.. ఇప్పుడు తలైవాకు లోకనాయకుడ్ని జత చేసి, రికార్డుల వేటకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.
నిజానికి రజనీకాంత్ కెరీర్ మొదలైందే కమల్‌హాసన్‌తో. రజనీ తొలి సినిమా 'అపూర్వరాగంగళ్'లో హీరో కమల్‌హాసనే. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి దాదాపు ఓ డజన్ సినిమాల్లో నటించారు. తమిళనాట ప్రాణస్నేహితులుగా పేరు గడించారు. బాలీవుడ్‌లో అమితాబ్ హీరోగా రూపొందిన 'గిరఫ్తార్'(1985) సినిమాలో వారిద్దరూ చివరిసారిగా కలిసి నటించారు. వినిపిస్తున్న వార్త నిజమైతే.. 40ఏండ్ల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు ఈ సింహాలు తలపడనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులందరికీ ఇది నిజంగా శుభవార్తే.

# ఈ దేశాన్ని మళ్లీ బడిలో వేయాలి!



'తమ్ముడు నారాయణమూర్తి తేనెటీగలాంటి మనిషి. ఎప్పుడూ తిరుగుతూ ఉంటాడు. అన్ని చోట్లా తేనె పోగేసుకొని వచ్చి తలా ఒక చుక్క పంచిపెట్టాలి అనే సంకల్పం ఉన్న వ్యక్తి. అందమైన హీరో ఎవరని అడిగితే నేను నారాయణమూర్తి పేరు చెబుతా. అందం అంటే గ్లామర్ కాదు. సేవాభావం, దయాగుణమే నిజమైన అందం. నారాయణమూర్తి నిరంతరం ప్రజల గురించి ఆలోచిస్తారు. పేదల పక్షాన నిలుచుంటాడు' అని అన్నారు ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం. ఆర్.నారాయణమూర్తి స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందిన 'యూనివర్సిటీ పేపర్‌లీక్' చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశానికి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఇంకా చెబుతూ 'నారాయణమూర్తికి ఉన్న జ్ఞానానికి ఊతం ఇచ్చి ఆదరిస్తే ఇంకా ఎన్నో మంచి సినిమాలు తీస్తాడు. సమాజపు భారాన్ని తన భుజాన వేసుకొని మోస్తున్న వ్యక్తి నారాయణమూర్తి. పేపర్ లీకేజీల వల్ల ఎంతో మంది బలైపోతున్నారు. సమాజాన్ని మేల్కొలిపే ఇలాంటి చిత్రాల్ని అందరూ చూడాలి. నాకు తెలిసినప్పటి నుంచి నారాయణమూర్తి ఒకేలా ఉన్నారు. నలభైఏళ్ల కెరీర్‌లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా జీవితాన్ని గడుపుతున్నాడు. నాకు వెంకటేశ్వరస్వామి అంటే ఇష్టం. నారాయణమూర్తి అంటే ఇష్టం' అన్నారు. ఈ సినిమా ఉద్దేశించి మాట్లాడుతూ..'ఈ దేశాన్ని మళ్లీ బడిలో వేయాలి' అని వ్యాఖ్యానించారు బ్రహ్మానందం. తెలుగు ఇండస్ట్రీలో బ్రహ్మానందం మహానటుడు, జ్ఞాని..అన్నింటికి మించి మంచి మాస్టారు. అందుకే ఆయనకు సినిమా చూపించానని, ఆయన ప్రసంగం వింటుంటే ఆనందబాష్పాలను ఆపుకోలేకపోయానని ఆర్.నారాయణమూర్తి భావోద్వేగానికి గురయ్యారు.



# మస్తు మెంటలెక్కిస్తోంది..

2022లో విడుదలైన మసూద సినిమా తెలుగు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. భయపెట్టే హారర్ కథతో పాటు, నటీనటుల నేచురల్ యాక్టింగ్ కూడా సినిమాకి పెద్ద హైలైట్ అయ్యింది. ముఖ్యంగా చిన్నారి పాత్రలో కనిపించిన బాంధవి శ్రీధర్.. దెయ్యం పట్టిన పాపగా అందరినీ ఫిదా చేసింది. ఆ సినిమా హిట్ అయిన తర్వాత బాంధవి ఒక్కసారిగా హాట్ టాపిక్ అయిపోయింది. ఇప్పుడు ఆమె రియల్ లైఫ్ లుక్ మాత్రం వారెవ్వా అనేలా ఉంది. వరుస ఫోటోషూట్లతో సోషల్ మీడియాలో తన అందాలను ఆరబోస్తూ కుర్రకారులో క్రేజ్ పెంచుకుంటుంది. ఇటీవల షేర్ చేసిన ఫోటోలలో జీన్స్ ప్యాంట్, ట్రెండీ లుక్‌లో గ్లామర్ చూపిస్తూ కట్టిపడేసింది. ఈ ఫోటోలు చూసి నెటిజన్స్ ఓ రేంజ్‌లో కామెంట్లు పెడుతున్నారు. త్వరలోనే ఈమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వడం పక్కాక అంటున్నారు. ఇండస్ట్రీ టాక్ ప్రకారం.. బాంధవికి ఇప్పటికే కొన్ని సినిమాల ఆఫర్లు వస్తున్నాయట. ఓ రెండు ప్రాజెక్ట్స్ గురించి చర్చలు జరుగుతున్నాయి. అయితే అధికారికంగా ఏదీ కన్ఫర్మ్ కాలేదు. హీరోయిన్‌గా లాంచ్ అయ్యే అవకాశం బలంగా ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. స్క్రీన్‌పై భయపెట్టిన ఈ మసూద చిన్నారి... రాబోయే రోజుల్లో గ్లామర్ హీరోయిన్‌గా ప్రేక్షకుల గుండెల్లోకి దూసుకుపోతుందా? అని ఇప్పుడు టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది. ఈ వయ్యారి లేటెస్ట్ ఫోటోలపై మీరూ ఓ లుక్కేయండి...



# కేక పెట్టించిన గ్లామరస్ బ్యూటీ..

సోషల్ మీడియాలో ఒక్కసారిగా సెగలు పుట్టిస్తుంది క్రేజీ హీరోయిన్ నేహా శెట్టి. ఈ ముద్దుగుమ్మ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. తాజాగా నేహా షేర్ చేసిన ఫోటోస్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. ఆమె పోస్టులకు క్రేజీగా కామెంట్స్ చేస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డ సరసన డీజే టిల్లు సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డమ్ సంపాదించుకుంది నేహా శెట్టి. ఈ సినిమాలో మోడ్రన్ లుక్స్ తో కుర్రకారుకు నిద్రలేకుండా చేసింది. ఈ మూవీ తర్వాత ఈ అమ్మడు క్రేజ్ మారిపోయింది. ఎక్కడ చూసినా ఈ చిన్నది పేరే వినిపించింది. తెలుగులో వరుస ఆఫర్స్ అందుకుంటూ అతి తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకుంది. తెలుగులోనే కాకుండా కన్నడ ఇండస్ట్రీలోనూ వరుస సినిమాల్లో నటిస్తుంది. డీజే టిల్లు సినిమా ఈ బ్యూటీకి వరుసగా ఆఫర్స్ తెచ్చి పెట్టింది. అయితే కొన్నాళ్లుగా టాలీవుడ్ లో సైలెంట్ అయింది నేహా శెట్టి. డీజే టిల్లు తర్వాత ఒకటిరెండు చిత్రాల్లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు మాత్రం ఒక్క సినిమా సైతం ప్రకటించలేదు. కేవలం కన్నడలోనే సినిమాలు చేస్తుంది. తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోతుంది ఈ భామ. కానీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ నెట్టింట సందడి చేస్తుంటుంది. అలాగే ఏదోక క్రేజీ పిక్ షేర్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి.

# కార్మిక సంఘాలతో ఛాంబర్ భేటీ



కార్మికుల సమ్మె కారణంగా గత పదహారు రోజులుగా సినిమా షూటింగులు నిలిచిపోయిన విషయం విదితమే. ప్రముఖ నటుడు చిరంజీవితో సోమవారం ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు భేటీ కావడం, అదేరోజున ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్‌తో నిర్మాతలు సమావేశమవ్వడం.. ఈ రెండు సమావేశాలూ మంగళవారం జరుగనున్న చర్చలపై ఆసక్తిని పెంచాయి.
నిజానికి మంగళవారం చిరంజీవితో ఇరువర్గాల భేటీ మరోసారి ఉంటుందని ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని ప్రకటించారు. అయితే.. మంగళవారం చిరంజీవితో ఎలాంటి చర్చలూ జరుగలేదు. ఫిల్మ్‌ఛాంబర్‌తో ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యుల సమావేశం మాత్రం సుదీర్ఘంగా జరిగింది. కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ వీరశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో.. 24 శాఖలకు సంబంధించిన 13 యూనియన్లతో విడివిడిగా ఛాంబర్ చర్చించింది. సమావేశం అనంతరం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని మీడియాతో మాట్లాడారు.
'నిర్మాతలు మా ముందుంచిన వర్కింగ్ కండీషన్ల గురించి సుదీర్ఘ చర్చ జరిగింది. మా అభిప్రాయాలను క్లియర్‌గా ఫిల్మ్‌ఛాంబర్‌కి వినిపించాం. రేపు ఉదయం నిర్మాతలతో కూడా మాట్లాడి, సాయంత్రం 4 గంటలకు అందరికీ ఆమోదయోగ్యమయ్యే ఓ మంచిమాట చెబుతామని ఛాంబర్ సభ్యులు తెలియజేశారు. వేతానాల పెంపు విషయంలోనూ ఛాంబర్ సానుకూలంగానే స్పందించింది. వేతనాలు పెంచేందుకు నిర్మాతలు మినహాయించిన మూడు యూనియన్లకు కూడా వేతనాలు పెంచేందుకు ఛాంబర్ అంగీకరించింది. అయితే.. ఎంత శాతం పెంచేది రేపు తెలుస్తుంది. చిరంజీవిగారితో ఫోన్లో మాట్లాడి అన్ని విషయాలనూ వివరించాం. బుధవారం ఫిల్మ్‌ఛాంబర్ నుంచి మంచి కబురును ఆశిస్తున్నాం.' అన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com